క్లుప్తంగా

నేడు మీర్‌ఖాన్‌పేటకు మంత్రి సబిత రాక

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లను కేటాయించడానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సోమవారం మధ్యాహ్నం 3గంటలకు మీర్‌ఖాన్‌పేటకు రానున్నట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీర్‌ఖాన్‌పేట, బేగరికంచెల పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ప్లాట్లకు సంబంధించిన సర్టిఫికెట్లను మంత్రి అందజేస్తారన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీకి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

'దళిత-గిరిజన ఆత్మగౌరవ సభ'కు కాంగ్రెస్ నాయకులు



బాలాపూర్ నుంచి నాగర్‌కర్నూల్‌కు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

బడంగ్‌పేట్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో దళిత-గిరిజన ఆత్మగౌరవ సభకు బడంగ్‌పేట కార్పొరేషన్ బాలాపూర్ నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, బడంగ్‌పేట కార్పొరేటర్లు సంతోషి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అమృతనాయుడు, మౌనికరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మహిళలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా తరలివెళ్లారు.

మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలి

జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి



యూజీడీ పనులు ప్రారంభిస్తున్న ఆచారి, యాదమ్మ

ఆమనగల్లు: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కోరారు. పట్టణంలోని 11వ వార్డులో ఆదివారం రూ.10 లక్షలతో నిర్మించే యూజీడీ నిర్మాణ పనులను కౌన్సిలర్ బైకని యాదమ్మతో కలిసి ఆచా రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ము న్సిపల్ పాలకవర్గం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు చెక్కల లక్ష్మణ్, చెన్నకేశవులు, విక్రంరెడ్డి, విజయ్‌కృష్ణ, కో ఆప్షన్ సభ్యులు మేడిశెట్టి శ్రీధర్, పాషా, నాయకులు బైకని శ్రీశైలంయాదవ్, గోరటి నర్సింహ, శ్రీకాంత్‌సింగ్, రాములు, గిరియాదవ్, రాములు, పర్వతాలు, వెంకటేశ్, నర్సింహ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం: బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్), అవేర్ (అవేర్ హెల్త్ అండ్ రిసెర్చ్ ఫౌండేషన్, నేషనల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆటోనగర్‌లో లారీల అడ్డా వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంబంధిత అధికారి ఎస్.వెంకన్న తెలిపారు. అంకిత, కామినేని ఆస్పత్రులకు చెందిన ప్రముఖ వైద్యులు గుండె జబ్బులు, నరాలు, షుగర్, కంటి వైద్యం, హోమియోపతి, డెంటల్ తదితర సమస్యలపై పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వారికి తగిన సూచనలు, సలహాలు ఇస్తారని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇటీవల ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సందర్శించిన సమయంలో విద్యార్థులు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను సమకూర్చారు. ఆ కిట్లను ఆదివారం ప్రభుత్వ కళాశాల ఆవరణలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రమేశ్‌గౌడ్, అభినవ్ విద్యార్థులకు అందజేశారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన సైదులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యుల ద్వారా బాధితుడికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంతోనే ఆనందం

మంత్రి సబితారెడ్డి



సబితారెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

బడంగ్‌పేట్: అందరూ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందంగా ఉంటుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌వీఎస్ ట్రస్ట్, వైష్ణవ సేవా సంఘం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఆదివారం విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యాలపై శ్రద్ధ చూపించలేకపోవడంతో మనకు తెలియకుండానే అనారోగ్యాల బారిన పడుతున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీవీ శ్రీనివాస్, ఏకే.చారి, వెంకటాచారి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, స్వప్న, రమాదేవి, మమత, శ్రీనివాస్ రెడ్డి, ఎస్.అర్జున్, పి.ఆనంద్‌రెడ్డి, నిర్వాహ కులు చక్రవర్తుల జగన్మోహనాచార్యులు పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి

ఉపాధ్యాయ పదోన్నతులతో పాటు భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించాలని విన్నవిస్తూ ఆదివారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డిని కలిసి భాషా పండితులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం కేసీఆర్ ఇచ్చినమాట ప్రకారం భాషా పండితులను అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలన్నారు. హైకోర్టు తుది తీర్పుకు లోబడి భాషా పండితులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. త్వరలో విడుదల కాబోయే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్లోనే భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించాలని మంత్రిని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్, కె.గోపాల్, పి.వెంకటస్వామి, నారాయణ, గురునాథం, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కందుకూరు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరతున్నారని విద్యాశాఖ మంత్రి సబితా రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మాదాపూర్ మాజీ సర్పంచ్ జంగారెడ్డితో పాటు ఆయన వెంట వివిధ పార్టీలకు చెందిన పలువురు, బాచుపల్లికి చెందిన దుర్గని సుధీర్‌కుమార్ తదితరులు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి బీఆర్ఎస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమంతో పాటు పార్టీ కోసం పని చేస్తున్న ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహా రెడ్డి, నాయకుడు ఎండీ దావూద్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసమే పార్టీ మారా

మీర్‌పేట: తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు అభివృద్ధి చేసి భవిష్యత్ తరాలకు ఫలాలు అందించాలన్న లక్ష్యంతోనే పార్టీ మారినట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి 46వ డివిజన్ గాంధీనగర్‌లో రూ.39.50లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులను ఆదివారం మంత్రి ప్రారంభించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ట్రంక్‌లైన్ పూర్తి చేసి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు చెరువుల సుందరీకరణకు శ్రీకారం చుట్టామన్నారు. చందన చెరువును ఇప్పటికే పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని, మంత్రాల చెరువును త్వరలోనే సుందరీకరించి, వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కులు, క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 10 చెరువులను దశల వారీగా సుందరీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్ నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీనగర్ ఫేజ్-2కు చెందిన 30 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

వసతులు కల్పించాలని మంత్రికి వినతి..

మీర్‌పేట ప్రశాంతిహిల్స్ ఫేజ్-4కు చెందిన కాలనీ వాసులు ఆదివారం కో ఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రజాక్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న రోడ్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు. డ్రైనేజీ లైన్లను వేయాలని కోరారు.

రైతు సంక్షేమానికి సీఎం కృషి

మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన సిద్దోజు కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు ఆమె వారి కుటుంబ సభ్యులకు రైతు బీమా చెక్కు రూ. 5లక్షలు, సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.60వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ ఫలాలు అందజేస్తూ సీఎం కేసీఆర్ ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పిల్లల చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్లూరు ఎంపీటీసీ సభ్యుడు నడికూడ రమేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేవులా నాయక్, జగన్, యాదయ్య, అర్జున్, విద్యాకర్‌రెడ్డి, పాండు నాయక్, రాజు చారి, బాలయ్య, కృష్ణ నాయక్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.30 లక్షల నిధులు

కందుకూరు:మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకుగాను మంత్రి సబితారెడ్డి చొరవతో రూ.30లక్షల నిధులు మంజూరైనట్లు జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. దావూద్‌గూడలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10లక్షలు, కొత్తగూడ సీతారామశాస్త్రినగర్ నుంచి కేజీబీవీ పాఠశాల వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు, సాయిరెడ్డిగూడలో సీసీ, మెటల్ రోడ్ల నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు

సర్పంచ్ మల్లారెడ్డి

కందుకూరు: క్రీడలతో స్నేహ భావం పెంపొంది మానవ సంబంధాలు బలోపేతమవుతాయని కొత్తగూడ సర్పంచ్, సర్పంచుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సాధ మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తగూడలో కేపీఎల్ 5వ సీజన్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సామ ప్రకాశ్‌రెడ్డి, బొక్క ప్రభాకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అరవిందరెడ్డి, ఆనంద్‌రెడ్డి, అభిలాశ్‌రెడ్డి, పరమేశ్, శ్రీపాల్, నిర్వాహకులు అంజన్‌ముదిరాజ్, ఎల్లారెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

విదేశీ విద్య, వసతులపై సెమినార్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డాగ్‌హిచ్‌క్లిఫ్, చిత్రంలో టీకేఆర్

మీర్‌పేట: పేద, మధ్య తరగతి విద్యార్థులకు విదేశీ విద్య అందని ద్రాక్షగా ఉన్నందున మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం విదేశీ విద్య, అక్కడ ఉండే ఏర్పాట్లు, వసతులపై అవగాహన కల్పించారు. ఈ క్యార్యక్రమంలో కేటీఐ కాలేజ్ కింగ్‌సోన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రేలియా డీన్ డా.డాగ్‌హిచ్‌క్లిఫ్, వారి బృందం విద్యార్థులకు విదేశీ విద్యపై వివరించారు. ఈ సందర్భంగా డా.డాగ్ భారతీయ విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీలలో విద్యావిధానం, తక్కువ ఖర్చుతో విద్యను అభ్యసించే విధానంపై వివరించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి విదేశాల్లో చదివి, స్థిరపడాలన్న కోరిక ఉంటుందని, అలాంటి విద్యార్థుల కోసమే కళాశాలలో సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. యాక్సెస్ కళాశాల, యాక్సెస్ కళాశాల ఎం.డి డా.సత్యశుక్లా, గిరిజా సంపత్ రిక్రూట్మెంట్, కార్పొరేట్ రిలేషన్స్, హెడ్ ప్లేస్‌మెంట్ ట్రైనర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గులు, ఆటల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేత రాజేశ్వర్‌రావు, తదితరులు

మీర్‌పేట: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మీర్‌పేటలోని జనప్రియా మహానగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు డ్రాయింగ్, లెమన్ స్పూన్, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి సమతా నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు డా.రాజేశ్వర్‌రావు న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఇందిర, జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భగా వారు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య, ఎస్.విజయలక్ష్మి, పద్మ, నిర్వాహకులు సలీమా, మస్తాన్‌బీ, స్వర్ణ, జన విజ్ఞాన వేదిక నాయకులు టి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడ రెడ్డి సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చల్లా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బొక్క రాజేందర్‌రెడ్డి (కార్పొరేటర్), పోరెడ్డి జంగారెడ్డి, కొత్త జయసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చప్పిడి జంగారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బెడదల సురేందర్‌రెడ్డి, అర్కల కాశీనాథ్‌రెడ్డి, కోశాధికారిగా జిల్లెల దామోదర్‌రెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధిగా పోరెడ్డి సుధాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా మల్లెల విజయభాస్కర్‌రెడ్డి, నాందారి ప్రభాకర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లెల నరేందర్‌రెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, మేకల రవీందర్‌రెడ్డి, పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు కొత్త మనోహర్ రెడ్డి సంఘం అభివృద్ధికి రూ.1.50 లక్షలు విరాళం అందజేశారు.

ఆలయాభివృద్ధికి రూ.50 వేల విరాళం



విరాళం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. దైవ మార్గంతోనే సమాజంలో శాంతి వెల్లివిరుస్తుందన్నారు. శిథిలమైన ఆలయాల మరమ్మతులతో పాటు, నూతన ఆలయాల నిర్మాణానికి ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు రథసప్తమి సందర్భంగా జాతర ఉత్సవాల నిర్వహిస్తామని.. ఈ సందర్భంగా ఆలయ తేరు (రథం) నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని జెడ్పీటీసీని కోరారు. వెంటనే స్పందించిన ఆయన ట్రస్టు ద్వారా చెన్నకేశవస్వామి ఆలయాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ మేరకు ఆదివారం ట్రస్టు సభ్యులచే రూ.50వేలను తలకొండపల్లిలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్, రవి, నర్సింహ, శ్రీను, దశరథం, రమేశ్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన వెంకటమ్మ నూతనంగా ఇంటి నిర్మాణం ప్రారంభించింది. ఇంటి నిర్మాణ సామగ్రి డబ్బులు లేక పనులు నిలిచిపోయాయి. దీంతో విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ ట్రస్ట్ ద్వారా ఇంటి నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ట్రస్టు నుంచి స్టీల్, సిమెంట్, కంకర, ఇటుక, ఇసుక, తదితర మెటీరియల్ అందజేశారు. ట్రస్టు సభ్యులు వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మైసయ్య, పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

పీసీసీ ప్రధాన కార్యదర్శి పారిజాత



పారిజాతతో కాంగ్రెస్ గిరిజన నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి నియోజకవర్గంపై పార్టీ జెండా ఎగురవేస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాతనర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ గిరిజన నాయకులు పారిజాతనర్సింహారెడ్డిని కలిసి పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు భూ పంపిణీ, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు కలిగిన వారికి 9రకాల సరుకులు, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తుచేశారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉందన్నారు. నేతలు మాత్రమే పార్టీని వీడారని కార్యకర్తలు కాంగ్రెస్‌తోనే ఉన్నారన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం కోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నేనావత్ రాజు నాయక్, హర్షగూడ సర్పంచ్ వి.పాండు నాయక్, పార్టీ సీనియర్ నాయకులు గాంసీరామ్ నాయక్, మోహన్ నాయన్, దస్రు నాయక్, శశికాంత్ నాయక్, రవి నాయక్, సేవ్యా నాయక్, రాజు నాయక్, శ్రీనివాస్ నాయక్, బిచ్యా నాయక్, గణేష్ నాయక్, రవి నాయక్, రామ్‌జా, దేవా నాయక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకహిల్స్‌లో శ్రమదానం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ వినాయకహిల్స్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు శ్రమదానం నిర్వహించారు. కాలనీలో ఉన్న ఇళ్ల ఎదుట, రోడ్లకు ఇరువైపుల పేరుకుపోయిన పిచ్చి మొక్కలు., చెట్లు తొలగించి శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి కాలనీల్లో శుభ్రతను పాటించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నిషేధిత కవర్లను వాడకూడదని కాలనీవాసులను కోరారు. పచ్చదనం పర్యావరణం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. గుంతలమయమైన రోడ్లల్లో తాత్కాలికంగా మట్టి పోసి చదును చేశామన్నారు. త్వరలోనే మంత్రి సబితారెడ్డి దృష్టికి సమస్యను వివరించి సీసీ రోడ్లకు నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములమవుదామని పిలుపు నిచ్చారు. ఇంటిలోని తడి, పొడి చెత్తను చెత్త సేకరణదారులకే ఇవ్వాలని సూచించారు. వినాయకహిల్స్ కాలనీని బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దేందుకు కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, కోశాధికారి శివకుమార్, అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు



కోట మైసమ్మ తల్లికి బోనం సమర్పించేందుకు వెళ్తున్న ఆలయ చైర్మన్ సుధీర్ గౌడ్, డైరెక్టర్లు, భక్తులు

మహేశ్వరం: మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో గడికోట మైసమ్మ బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు నెల రోజుల ముందుగా గడికోట మైసమ్మకు బోనాలు సమర్పించడం అక్కన్నమాదన్నల కాలం నుంచి అనవాయితీగా వస్తోంది. ఈ ప్రకారం ఆలయ చైర్మన్, దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గడికోట మైసమ్మకు ప్రత్యేకంగా బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సుదర్శన్, శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్లు చంద్రయ్య, బాల్‌రాజ్, మహేందర్, వెంకటేశ్, పీఏసీఎస్ డైరెక్టర్లు ప్రభాకర్, బాలయ్య, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఏకలవ్య, శ్రీకాంత్, పరమేశ్, నాగేశ్వర్, ప్రకాశ్, కృష్ణ, కుమార్, మైసయ్య, సంజీవ, రాజు, ఆలయ పూజారి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు యాదయ్య

తుర్కయంజాల్: పేదల ఇంటి స్థలాల కొరకు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.శివకుమార్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. నేటికీ పేదల ఇంటి స్థలాల కొరకు పోరాటాలు చేయడం దారుణం అన్నారు. తుర్కయంజాల్‌లోని పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వెంటనే ఇవ్వకపోతే ప్రభుత్వ భూముల్లో ఎర్ర జెండాలు పాతి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గువ్వల రాజు, పిల్లి కృష్ణ, భాస్కర్, శివకుమార్, యాదయ్య పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడండి

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నంరూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై కాంగ్రెస్ కార్యకర్తలు పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం తొర్రూర్‌లోని మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేసి అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రశ్నించాలని సూచించారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు .

వార్డు అధ్యక్షుడి నియామకం

ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి వార్డు కాంగ్రెస్ నూతన అధ్యక్షులను నియమించారు. 4వ వార్డు అధ్యక్షుడిగా పల్లాటి యాదగిరి, 12వ వార్డు అధ్యక్షుడిగా సీహెచ్.సత్యనారయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ఏ జహంగీర్‌ఖాన్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జంగయ్య, అశోక్, మాజీ ఉప సర్పంచ్ రాములు, ఎంఆర్ఆర్ ఉపాధ్యక్షుడు సురేశ్, సీహెచ్ రమేశ్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు .



రంగారెడ్డితో మంగళ్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు